పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 751 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ మంగళవారం 20.10.2026 పేజీలు : 8 వెల : 4/-

విజయదశమి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని రేపు 20.10.2026 మా పత్రిక కార్యాలయానికి సెలవు. కావున ఎల్లుండి 21.10.2026 దినపత్రిక వెలువడదు. పాఠకులు, మరియు ప్రకటనకర్తలు ఈ విషయాన్ని గమనించగలరు.



2లో

## రోడ్డును దున్నేసినందుకు
# సిగ్గుపడాలి: నారా లోకేశ్

- పుల్లలపేట మండలంలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేశారని ఆరోపణ
- వైసీపీ నేతలే ట్రాక్టర్‌తో రోడ్డును తవ్వేశారన్న మంత్రి నారా లోకేశ్
- రూ.4.75 కోట్లతో నిర్మించిన రోడ్డు అని వెల్లడి
- ఇది కక్షపూరిత చర్య అని, ప్రజలపై దాడి అని తీవ్ర ఆగ్రహం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, పోలీసులకు విజ్ఞప్తి

## స్థానిక సంస్థల్లోనూ కూటమికి
# జై కొట్టండి: సీఎం చంద్రబాబు పిలుపు

- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు
- గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి



సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక

తరువాయి 2లో

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు..
# శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ

- శాంతి ప్రయత్నాలకు క్షిపణులే రష్యా సమాధానమన్న జెలెన్‌స్కీ
- రష్యా దాడికి తాము ఎదురుదాడి చేయాల్సి వస్తోందని వెల్లడి
- మిత్ర దేశాల నుంచి క్షిపణి హెచ్చరికలు అందలేదన్న ఉక్రెయిన్



2లో

## క్వాంటమ్ ప్రపంచంలో కొత్త ఆవిష్కరణ..
# 'ఫ్రాక్షనల్ ఫెర్మి సముద్రం' గుర్తింపు

- పదార్థం యొక్క సరికొత్త క్వాంటమ్ స్థితిని ఆవిష్కరించిన శాస్త్రవేత్తలు
- దీనికి 'ఫ్రాక్షనల్ ఫెర్మి సముద్రం' అని నామకరణం
- సీజియం అణువులపై జరిపిన ప్రయోగాల ద్వారా గుర్తింపు
- అత్యధిక శక్తిస్థాయిలోనూ క్రమపద్ధతిలో ఉండటం దీని ప్రత్యేకత
- భౌతికశాస్త్ర ప్రాథమిక సూత్రాలపై అవగాహన పెంచనున్న ఆవిష్కరణ



## వందే భారత్ జోరు.. 180 కి.మీ. వేగంతో
# దేశీయ రైలు పరుగులు!

- 2019లో ప్రారంభమై.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 160కి పైగా రైళ్ల సేవలు

2లో





# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి: సీఎం పిలుపు

సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని, ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.

**చెప్పాం.. చేస్తున్నాం..**

2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం 2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

*** విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ**

ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్‌జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్‌జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

## రోడ్డును దున్నేసినందుకు సిగ్గుపడాలి: నారా లోకేశ్

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో దారుణమైన ఘటన చోటుచేసుకుందని, వైసీపీ నాయకుల కక్షపూరిత చర్యలకు ఇది నిదర్శనమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజల కోసం రూ.4.75 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును, వేసిన నాలుగు రోజులకే వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్య దిగ్భ్రాంతికరమని, సిగ్గుచేటని ఆయన అభివర్ణించారు. పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం, పాపక్కగారిపల్లె గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డును నిర్మించామని లోకేశ్ తెలిపారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించి రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో గ్రామస్థులు సంతోషంగా ఉన్నారని, కానీ వారి ఆనందాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని అన్నారు. "ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం రాజకీయం అనిపించుకోదు. ఇది కచ్చితంగా ప్రజలపై జరిగిన అహంకారపూరిత దాడి. కక్ష సాధింపు చర్యలతో ప్రజాధనాన్ని ఇలా నాశనం చేయడం అత్యంత హేయమైన చర్య" అని లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆయన కోరారు. ధ్వంసమైన రోడ్డును వీలైనంత త్వరగా పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అరాచక చర్యలను ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం నిందితులకు శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.

## క్వాంటమ్ ప్రపంచంలో కొత్త ఆవిష్కరణ.. 'ఫ్రాక్షనల్ ఫెర్మి సముద్రం' గుర్తింపు

భౌతిక శాస్త్రంలో శాస్త్రవేత్తలు ఒక కీలకమైన ముందడుగు వేశారు. పదార్థం యొక్క అసాధారణమైన, సరికొత్త క్వాంటమ్ స్థితిని విజయవంతంగా గుర్తించారు. 'ఫ్రాక్షనల్ ఫెర్మి సముద్రం' అని పిలుస్తున్న ఈ వింత దశను కనుగొన్నట్లు హన్స్‌క్రిస్టోఫ్ నేగెర్ల్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం ప్రకటించింది. ఈ పరిశోధన వివరాలు ప్రతిష్ఠాత్మక 'ఫిజికల్ రివ్యూ లెటర్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అద్భుతమైన స్థితిని ఆవిష్కరించడానికి, శాస్త్రవేత్తలు అత్యంత శీతల స్థితిలో ఉన్న సీజియం అణువులను ఉపయోగించారు. వాటిని ఒకే దిశలో (ఒకే డైమెన్షన్‌లో) కదిలేలా పరిమితం చేశారు. అనంతరం, ఆ అణువుల మధ్య ఉండే పరస్పర చర్యలను అత్యంత వేగంగా మార్చారు. వాటి మధ్య ఉండే బలమైన వికర్షణ శక్తిని అకస్మాత్తుగా బలమైన ఆకర్షణ శక్తిగా మార్చడం ద్వారా, వ్యవస్థను సమతౌల్యానికి చాలా దూరంగా తీసుకెళ్లారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో అణువులు గందరగోళానికి గురై, క్రమరహితంగా మారతాయి. కానీ ఆశ్చర్యకరంగా, ఈ ప్రయోగంలో అణువులు అత్యంత ఉత్తేజిత శక్తిస్థాయిలో ఉన్నప్పటికీ, ఒక క్రమపద్ధతిలో అమరినట్లు పరిశోధకులు గమనించారు. సాధారణంగా ఎలక్ట్రాన్ల వంటి ఫెర్మియాన్ కణాలు 'పౌలీ ఎక్స్‌క్లూజన్ ప్రిన్సిపుల్'ను పాటిస్తాయి. దీని ప్రకారం, శక్తి స్థాయిలను ఒక నిర్దిష్ట పద్ధతిలో నింపుతాయి. దీనినే 'ఫెర్మి సముద్రం' అంటారు. అయితే, కొత్తగా కనుగొన్న ఈ 'ఫ్రాక్షనల్ ఫెర్మి సముద్రం'లో క్వాంటమ్ స్థితులు నిండే విధానం భిన్నంగా ఉంది. ఇక్కడ 'ఫ్రాక్షనల్' అంటే అణువులు ముక్కలుగా విడిపోయాయని కాదు, క్వాంటమ్ స్థితులను ఆక్రమించే నమూనాలో ఉన్న ప్రత్యేకతను ఇది సూచిస్తుందని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ ఆవిష్కరణ ప్రాథమిక భౌతిక శాస్త్రానికి ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. తీవ్రమైన పరిస్థితుల్లో పదార్థం ఎలా ప్రవర్తిస్తుంది, సంక్లిష్టమైన క్వాంటమ్ వ్యవస్థలు సమతౌల్యానికి దూరంగా ఉన్నప్పుడు కూడా ఎలా తమను తాము వ్యవస్థీకరించుకుంటాయనే దానిపై మన అవగాహనను ఇది మరింత విస్తృతం చేస్తుంది. భవిష్యత్తులో క్వాంటమ్ సిమ్యులేటర్ల అభివృద్ధికి, సిద్ధాంతాలను మెరుగుపరచడానికి ఈ పరిశోధన దోహదపడగలదని అంచనా వేస్తున్నారు. అయితే, కొత్త పదార్థాల తయారీ లేదా క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆచరణాత్మక అనువర్తనాల గురించి మాట్లాడటానికి ఇది చాలా తొందరపాటు అవుతుందని, ప్రస్తుతానికి ఇది ప్రాథమిక శాస్త్ర పరిశోధన మాత్రమేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

## విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు.. 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే!



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.13.3 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందాయి. ఈ మొత్తంలో దాదాపు 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే వచ్చినట్లు భారత ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాలు వెల్లడిస్తున్నాయి. క్రీడలు, ప్రజాపనుల శాఖ మంత్రి ఆధవ్ అర్జున, మరో మంత్రి ఆర్‌వీ రంజిత్‌కుమార్ ఈ విరాళాల్లో ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు. ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాల ప్రకారం.. ఆధవ్ అర్జున రూ.8.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. రంజిత్‌కుమార్ రూ.5 కోట్లు అందించారు. దీంతో పార్టీకి అందిన మొత్తం విరాళాల్లో అర్జున వాటా 60 శాతానికి పైగా ఉంది. టీవీకేకు అత్యధికంగా విరాళం ఇచ్చిన వ్యక్తిగా ఆయన నిలిచారు. ఈ ఇద్దరి విరాళాలతో పాటు మరో రెండు విరాళాలు కూడా పార్టీకి అందాయి. తూత్తుకుడి జిల్లా లయన్స్ టౌన్‌లో ఉన్న స్నో షో సంస్థ రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇచ్చింది. అదే చిరునామాలో నమోదైన స్నో ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ కూడా మరో రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అందించింది. ఓవరాల్ గా ఈ నాలుగు విరాళాల మొత్తం రూ.13.3 కోట్లుగా ఉంది. ఇదిలా ఉండగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో అన్నాడీఎంకే సుమారు రూ.161.35 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందుకున్నట్లు ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడించాయి. ఇందులో టైగర్ అసోసియేట్స్ సంస్థ రూ.135 కోట్లతో అతిపెద్ద విరాళదారుగా నిలిచింది. డీఎంకేకు ఇదే ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.191.19 కోట్ల విరాళాలు అందాయి. ఆ పార్టీకి కూడా టైగర్ అసోసియేట్స్ అత్యధికంగా రూ.125 కోట్లు ఇచ్చింది. కోల్‌కతాకు చెందిన ఈ లాటరీ సంస్థకు, తమిళనాడు లాటరీ వ్యాపారవేత్త శాంటియాగో మార్టిన్‌కు వ్యాపార సంబంధాలు ఉన్నట్లు కంపెనీ రికార్డులు సూచిస్తున్నాయి. ఆ సంస్థలో నియమిత భాగస్వామిగా ఉన్న సుబ్బయన్ నాగరాజన్.. మార్టిన్‌కు చాలాకాలంగా వ్యాపార సహచరుడిగా ఉన్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆ బాండ్లను అత్యధికంగా కొనుగోలు చేసిన సంస్థగా మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ నిలిచింది. పథకం రద్దు తర్వాత బహిర్గతమైన వివరాల ప్రకారం.. ఈ సంస్థ ఎన్నికల బాండ్ల ద్వారా డీఎంకేకు రూ.509 కోట్ల విరాళాలు అందించింది.

## వందే భారత్ జోరు.. 180 కి.మీ. వేగంతో దేశీయ రైలు పరుగులు!

భారత రైల్వేల ఆధునికీకరణలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు దూసుకుపోతున్నాయి. పూర్తిగా దేశీయ సాంకేతికతతో రూపుదిద్దుకున్న ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు గంటకు 180 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందుకునే సామర్థ్యాన్ని విజయవంతంగా నిరూపించుకున్నాయి. అత్యాధునిక సౌకర్యాలు, మెరుగైన వేగంతో భారతీయ రైల్వేల ముఖచిత్రాన్నే మార్చేస్తున్న ఈ రైళ్లు.. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో కీలక ముందడుగుగా నిలుస్తున్నాయి. 2019 ఫిబ్రవరిలో న్యూఢిల్లీ-వారణాసి మధ్య తొలి వందే భారత్ సేవలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తూ ఈ రైళ్ల నెట్‌వర్క్‌ను విస్తరించారు. ప్రస్తుతం దేశంలోని ముఖ్యమైన కారిడార్లలో 160కి పైగా వందే భారత్ రైళ్లు సేవలందిస్తున్నాయి. ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు, ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణ అనుభూతిని అందించడం వీటి ప్రత్యేకత. ఇటీవల మధురనాగ్‌డా, కోటానాగ్‌డా వంటి సెక్షన్లలో రైల్వే భద్రతా అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన హైస్పీడ్ ట్రయల్స్ విజయవంతమయ్యాయి. ఈ పరీక్షల్లో చైర్ కార్, స్లీపర్ వెర్షన్ రైళ్లు గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైళ్ల బ్రేకింగ్ వ్యవస్థ, రైడ్ క్వాలిటీ, ఇతర భద్రతా ప్రమాణాలను నిశితంగా పరిశీలించారు. అయితే, ట్రాక్ పరిస్థితులు, భద్రతా అనుమతుల ఆధారంగా వీటి కార్యాచరణ వేగాన్ని గంటకు 160 కిలోమీటర్ల వరకు పరిమితం చేస్తున్నారు. వందే భారత్ రైళ్లు 'ఆత్మనిర్భర్ భారత్' (స్వావలంబన భారతదేశం) స్ఫూర్తికి నిజమైన ప్రతిబింబమని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ ప్రయాణికుడు అభిప్రాయపడ్డారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యంలో ఈ రైళ్లు ఒక ముఖ్యమైన భాగమని అధికారులు పేర్కొంటున్నారు. భారత రైల్వేల భవిష్యత్ తరానికి ఈ రైళ్లు పునాది వేస్తున్నాయని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. స్లీపర్ కోచ్‌ల రాకతో సుదూర ప్రయాణాలు కూడా మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.. శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ

యుద్ధాన్ని ముగించేందుకు తాము దౌత్యపరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, రష్యా మాత్రం దాడులతోనే సమాధానమిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ కోసం వచ్చిన ప్రతి ప్రతిపాదనకు తాము సానుకూలంగా స్పందించామని, కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు. రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంసమయ్యాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. "మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు. గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.



- "రెజీమ్ ఛేంజ్" అంటూ వ్యాఖ్యానించిన నేహా బోరా
- "రెజీమ్ ఛేంజ్" వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు, శశి థరూర్ మధ్య మాటల యుద్ధం

## 'రెజీమ్ ఛేంజ్'పై కిరణ్ రిజిజుకు శశిథరూర్ కౌంటర్

- **భారత్ బంగ్లాదేశ్ కాదంటూ ప్రతిపక్షాలపై విరుచుకుపడిన కిరణ్ రిజిజు**
- **మా లక్ష్యం ఎన్నికల ప్రక్రియను కాపాడటమేనని స్పష్టం చేసిన శశి థరూర్**
- **ఓటర్ల జాబితా సవరణపై కొనసాగుతున్న రాజకీయ వివాదం**

దేశ రాజకీయాల్లో "రెజీమ్ ఛేంజ్" (అధికార మార్పిడి) అనే పదం పెను దుమారం రేపుతోంది. ఈ అంశంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ధీటుగా బదులిచ్చారు. తాము ఆశిస్తున్నది స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలే తప్ప, అప్రజాస్వామికంగా ప్రభుత్వాన్ని కూల్చడం కాదని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను విమర్శిస్తూ జేఎన్‌యూ విద్యార్థి కార్యకర్త నేహా బోరా 'రెజీమ్ ఛేంజ్' అని వ్యాఖ్యానించిన వీడియో క్లిప్‌లతో పాటు, ప్రతిపక్షాలకు మద్దతిచ్చే మరికొందరి దృశ్యాలను జత చేస్తూ కిరణ్ రిజిజు 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. "ఈ వ్యక్తులను చూడండి, వీరు అధికార మార్పిడికి ప్రయత్నిస్తున్నారు. ఒకటి మాత్రం గుర్తుంచుకోండి, భారత్ బంగ్లాదేశ్ కాదు. భారత యువత ఎంతో తెలివైన వారు, వారు దేశాన్ని నిర్మిస్తారు తప్ప నాశనం చేయరు" అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై శశిథరూర్ స్పందిస్తూ, "భారత్‌ను బంగ్లాదేశ్‌తో లేదా ఫ్రాన్స్‌తో పోల్చడం అసంబద్ధం. ఫ్రాన్స్‌లో జరిగినట్లుగా బస్సులను తగలబెట్టడం, పోలీస్ స్టేషన్లపై దాడులకు దిగడం వంటి హింసాత్మక చర్యలను మేమెప్పుడూ సమర్థించం. మేము కేవలం శాంతియుత నిరసనలకు మాత్రమే మద్దతు తెలుపుతాం" అని అన్నారు. 'రెజీమ్ ఛేంజ్' అనే పదాన్ని వక్రీకరించవద్దని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజల పేర్లను అస్తవ్యస్తమైన, పాక్షికంగా చట్టవిరుద్ధమైన పద్ధతుల్లో తొలగించారని శశిథరూర్ ఆరోపించారు. "ఇది పూర్తిగా రాజ్యాంగపరమైన సమస్య. ఈ లోపాలను సరిదిద్దాలని మాత్రమే మేము కోరుకుంటున్నాము. అంతేకానీ, అక్రమ మార్గాల్లో ప్రభుత్వాన్ని కూలదోయాలనే ప్రయత్నం ఎంతమాత్రం కాదు" అని ఆయన వివరణ ఇచ్చారు.

## సంపాదకీయం

# స్థానిక సమరం..
# మారిన పాత్రలు.. మారని రాజకీయాలు!

మునిసిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం గురించి గవర్నర్‌ను కలిసిన జగన్మోహన్ రెడ్డి, మీడియా ముందు వెళ్ళబుచ్చిన ఆవేదనలో ఒక ప్రత్యేకత ఉన్నది. అరాచకాలకు సంబంధించిన వివరణలో ఆయన వర్ణన బాగుంటుంది. అది వివేకానందరెడ్డికి తగిలిన గొడ్డలి దెబ్బల గురించి అయినా, వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన విధానం గురించి అయినా, ప్రస్తుతం జరగబోతున్న ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అరాచకాలను చేస్తుందేమో అనే ఊహతోనే ఆయన స్పష్టంగా పిన్ టు పిన్ వర్ణిస్తారు. ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి ఇప్పుడున్న అనేకమంది రాజకీయ నాయకుల కంటే తెలివైనవాడు. వైసిపికి స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిచే అవకాశం కనిపించటం లేదు. వాస్తవంగా చెప్పాలంటే అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి. తన హయాంలో తనకు అండగా నిలిచిన సహచరులు అరెస్ట్ అవుతున్నారు. కొత్త కేసులు ఎప్పుడు వచ్చి తన తలుపు తడతాయో తెలియని పరిస్థితి. పాత కేసులు రోజువారీ విచారణకు రానున్నాయి. వీటన్నిటి మధ్య ఎన్నికల సంరంభం. కార్పొరేషన్ మేయర్లను, మునిసిపల్ చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నిక విధానంలో ఎన్నుకునే పద్ధతిని తీసుకువచ్చి చంద్రబాబు నాయుడు వ్యూహాత్మకంగా జగన్మోహన్ రెడ్డిని దెబ్బకొట్టారు. మేయర్, మునిసిపల్ చైర్మన్లను గతంలో మాదిరిగా కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఎన్నుకునే విధానమే ఉంటే, పోటీ చేయటానికి అభ్యర్థులను వెతుక్కునే పరిస్థితి ఉండేది కాదు. కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ఒక ఆశ ఉండేది. తాము గెలిస్తే మేయర్ పదవి కోసం పార్టీల అధిష్టానాన్ని ఒప్పించుకోవచ్చు . ఇప్పుడు ఆ ఆశ లేదు. గతంలో వారు తమ ఎన్నికకు అయ్యే ఖర్చు ఒక్కటి పెట్టుకుంటే సరిపోయేది. ఇప్పుడు మేయర్ అభ్యర్థికి మిగిలిన మెంబర్లతో పని లేదు. మేయర్ అభ్యర్థి తనను తాను గెలిపించుకుంటే సరిపోతుంది. అందువలన కార్పొరేటర్లు, కౌన్సిలర్ల చార్మ్ తగ్గిపోయింది. అధికార పార్టీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ప్రభుత్వంలో పనులు జరిగే అవకాశం ఉంటుంది కాబట్టి వాళ్లకు అభ్యర్థుల కొరత కనిపించి ఉండకపోవచ్చు. విపక్షంలో ఉండి చేయగలిగేది ఏమీ ఉండదు అనే నిర్లిప్తతతో పోటీ చేయటానికి వైసీపీ వైపుఎవరూ మొగ్గు చూపించలేదు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎన్నికల పోరులో అధికార పక్షానిదీ, విపక్షానిదీ ఒకటే దారి. వైసీపీని నామినేషన్లు వేయకుండా చూడాలని అధికార పార్టీ ఆలోచన. 2021 లో జరిగిన స్థానిక సంస్థల పోరులో నామినేషన్లు వేయలేని పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికలనే బహిష్కరించింది అనటమే సబబు. ఆ రోజు కుప్పంలో కూడా నామినేషన్ వేయనీయని పరిస్థితి. జగన్మోహన్ రెడ్డి రాజకీయాలను ప్రజల పరంగా కాకుండా వ్యక్తిగతంగా తీసుకోవటం వలన కుప్పం టార్గెట్ అయింది. ఈ రోజు టీడీపీ పులివెందులను టార్గెట్ చేసింది. అది టీడీపీ అధినాయకత్వం ఆదేశాల మేరకా, లేక గతంలో తమను టార్గెట్ చేసిన వైసీపీ మీద అదే జులుం చేయాలని నిర్ణయించుకున్న కార్యకర్తలదా అనేది నిర్ణయించటం కష్టం. కానీ, జగన్మోహన్ రెడ్డి కూడా పోటీ చేసి ఓడిపోవటం కంటే, నామినేషన్లు వేయనీయలేదనే నెపంతో తప్పకోవటం మంచిది అనే ఆలోచన చేసినట్లుగా కనిపిస్తున్నది. వైసీపీ హయాంలో రాష్ట్రంలో ఎక్కడా టీడీపీని నామినేషన్ వేయనివ్వకుండా చేసింది. తెలుగుదేశం ఇంకా పూర్తిగా అరాచకం సృష్టించటానికి అలవాటు పడలేదు కాబట్టి, గతంలో ఎక్కడెక్కడ గుండాయిజం జరిగిందో అక్కడ తన సత్తా చూపించే ప్రయత్నం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నామినేషన్ల పర్వాన్ని గమనిస్తే, వైసీపీ హయాంలో జరిగినంత అన్యాయపు ఎన్నికల విధానం కాకపోయినా, కొన్ని స్థానాలలో టీడీపీ నిజాయతీగా ఎన్నిక జరగకుండా చేసింది అనేది వాస్తవం. అయితే అరాచకాన్ని మొదలుపెట్టింది వైసీపీ కావటం విశేషం. పుంగనూరులో మిథున్ రెడ్డి తన వాహనంతో మొదలుపెట్టిన అరాచకం, రాయలసీమ నుండి ఉమ్మడి గుంటూరు జిల్లా వరకు ఒక హింసాత్మక వాతావరణాన్ని సృష్టించింది. అదే అదనుగా టీడీపీ శ్రేణులు వైసీపీ వాళ్ళు నామినేషన్లు వేయలేని పరిస్థితిని తీసుకొచ్చాయి. రెండున్నర సంవత్సరాలుగా స్తబ్ధుగా ఉన్న టీడీపీ కార్యకర్తలకు ఒక్కసారిగా ఆవేశం పెల్లుబికింది. అయినా అరాచకంలో వైసీపీని ఓడించలేకపోయారు అనే చెప్పాలి. టీడీపీ శ్రేణులు వైసీపీ పార్టీ వారిని మాత్రమే టార్గెట్ చేస్తే, వైసీపీ వాళ్లు పోలీసులను కూడా వదిలిపెట్టలేదు. మరొక్కసారి కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ వార్తల్లో వ్యక్తి అయ్యారు. జగన్మోహన్ రెడ్డి తన ప్రెస్ మీట్‌లో ఆయన పేరు ప్రస్తావించి మరీ ఆయనకు టీడీపీ కార్యకర్త అనే ముద్ర వేశారు. అయితే బీటెక్ రవి మాత్రం మొదటిసారి కడప జిల్లాలో ఫెయిర్ ఎలక్షన్ జరుగుతున్నది అని అంటున్నాడు. గతంలో పులివెందులలో వేరే వాళ్లు నామినేషన్లు కూడా వేయలేని పరిస్థితి ఉండేది. కానీ ఈ రోజు వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయగలిగారు అని చెబుతున్నారు. పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సహజ శైలి చూపించారు కానీ వెనక్కి తగ్గవలసి వచ్చింది. ఈ ఎన్నికలలో టీడీపీ గెలవటమే కాకుండా, అవసరమైతే తాను కూడా జులుం చేయగలదు అని నిరూపించుకునే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తున్నది. ఇది టీడీపీలో వచ్చిన మార్పు. అది దానంతట అది వచ్చిన మార్పో, ఎవరన్నా తెచ్చిన మార్పో కాలం నిర్ణయిస్తుంది. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం చాలా విషయాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎలక్షన్ కమిషన్ అనేది చాలా గొప్ప వ్యవస్థ అనే విషయం గుర్తు చేశారు. అదే సమయంలో ఆ వ్యవస్థ తన పరువును కాపాడుకోవాలని సూచించారు. ఇది ఆహ్వానించదగ్గ సూచన. కానీ తాను అధికారంలో ఉన్నప్పుడు ఆనాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ పట్ల తాను వ్యవహరించిన తీరుకు, ఆయన సామాజిక వర్గం ఏమిటో తానే ఊహించుకుని ఆయనపై చేసిన నిరాధార ఆరోపణలకు క్షమాపణలు చెప్పి ఉంటే బాగుండేది. అలా చేయకుండా ఇప్పుడు కూడా నిమ్మగడ్డ రమేష్ కుమార్ నిందించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో జగన్మోహన్ రెడ్డి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టానికి మద్దతు తెలిపి తాను పెద్ద తప్పు చేశానని ఒకటికి పదిసార్లు చెబుతున్నారు. భారత ఎన్నికల సంఘ కమిషనర్ల నియామకంలో భారత ప్రధాన న్యాయమూర్తి ఉండాలని గట్టిగా చెబుతున్నారు. ఒకనాడు ఇదే జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కే చెందిన భారత ప్రధాన న్యాయమూర్తిని ఏ రకంగా ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారో గుర్తు చేసుకుని, అన్యాపదేశంగా అయినా ఆయనకు కూడా క్షమాపణ చెప్పి ఉంటే హుందాగా ఉండేది. ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలని మరింత గట్టిగా చెబుతున్నారు. కానీ న్యాయవ్యవస్థ పైన, న్యాయమూర్తుల పైన ఇష్టారాజ్యంగా అసభ్యకరమైన పదజాలంతో తన అనుయాయులు పెట్టిన పోస్టుల వ్యవహారంలో హైకోర్టు నోటీసులు ఇచ్చినా మారని పరిస్థితిని ముందు చక్కదిద్దుకుని, వారిని తీసుకుని వచ్చి న్యాయస్థానానికి అప్పజెబితే అప్పుడు జగన్మోహన్ రెడ్డి వ్యవస్థలను గౌరవిస్తారని, నిజంగానే ఆయనలో మార్పు వచ్చింది అని నమ్మటానికి అవకాశం ఉంటుంది. లేకుంటే తాను అధికారంలో ఉన్నప్పుడు ఏ వ్యవస్థలనైతే అవమానపరిచారో, బాధ్యతాయుతమైనపదవుల్లో ఉన్నవారిని వ్యక్తిగతంగా దూషించారో, వారిని వారి బాధ్యతలను నిర్వర్తించకుండా అడ్డం పడి, అడ్డదారుల్లో వారిని ఆ బాధ్యతాయుతమైన పదవుల నుండి తప్పించే ప్రయత్నం చేశారో, వాటిని కప్పిపుచ్చుకుని ఇప్పుడు వారి గౌరవం కోసం సూచనలు చేస్తున్నారని భావించే ప్రమాదం ఉంటుంది. మొన్నటి ఎన్నికల నామినేషన్ల పర్వంలో జగన్మోహన్ రెడ్డి స్థాయిలో అరాచకం చేయకపోయినా, కొన్ని చోట్ల టీడీపీ కూడా జగన్మోహన్ రెడ్డి పంథాను పాటించి పొరపాటు చేసింది అని భావించక తప్పదు. అనుభవమున్న నాయకుడు చంద్రబాబు నాయుడు, అరాచకం చేసే జగన్మోహన్ రెడ్డి ట్రాప్‌లో పడినట్లు అయింది. ఇది ఆంధ్రప్రదేశ్‌కు, టీడీపీకి రెండింటికీ అభిలషణీయం కాదు. ఇప్పటికే ఆరిపోతున్న దీపం మాదిరిగా ఉన్న మన దేశ ప్రజాస్వామ్య మనుగడ మరింత ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదం ఉన్నది.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### అక్టోబర్ 20

OCTOBER 20

* 1859: అమెరికన్ తత్వవేత్త, విద్యావేత్త జాన్ డ్యూయీ జననం (మ.1952).
* 1891: న్యూట్రాన్ కనుగొన్నందుకు భౌతిక శాస్త్రములో నోబెల్ బహుమతి గ్రహీత జేమ్స్ చాడ్విక్ జననం (మ.1974).
* 1927: ప్రముఖ కవి, విమర్శకుడు, గుంటూరు శేషేంద్ర శర్మ జననం (మ.2007).
* 1938: ఆంధ్రుల అభిమాన హాస్యనటుడు రాజబాబు జననం (మ.1983). (చిత్రంలో)
* 1947: ఐక్యరాజ్యసమితి పతాకం ఆమోదించబడింది.
* 1956: ఆంగ్ల దర్శకుడు, నిర్మాత డానీ బాయిల్ జననం.
* 1963: భారతీయ క్రికెట్ మాజీ బ్యాట్స్‌మన్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ జననం.
* 1978: భారతదేశానికి చెందిన క్రికెట్ క్రీడాకారుడు వీరేంద్ర సెహ్వాగ్ జననం.
* 2010: నిజాం వ్యతిరేక ఉద్యమకారుడు, రాజకీయ నాయకుడు పాగ పుల్లారెడ్డి మరణం (జ.1919).



రాజబాబు

## అల్లూరి ఏజెన్సీలో 50 నుంచి 60 శాతం స్థానాల్లో
# పోటీ చేస్తాం: నాగబాబు

- అరకులో జరిగిన జనసేన పార్టీ సమావేశంలో నాగబాబు కీలక వ్యాఖ్యలు
- గిరిజన సమస్యల పరిష్కారంపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారన్న ఎమ్మెల్సీ
- పొత్తుల చర్చల నేపథ్యంలో నాగబాబు వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యం



జనసేన పార్టీ ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ సొసైటీ చైర్మన్ కొణిదెల నాగబాబు రాబోయే ఎన్నికల సీట్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలోని దాదాపు 50 నుంచి 60 శాతం సీట్లలో జనసేన పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అరకులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగబాబు, పార్టీ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జనసేన పార్టీకి అరకు ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని, మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కోట్లాది రూపాయలతో పవన్ పునాదులు వేశారని గుర్తుచేశారు. గిరిజనుల పురోగతికి ఇంకా ఎంతో చేయాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, ఏజెన్సీ ప్రాంతంలోని సీట్లపై నాగబాబు చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ప్రకటనతో ఏజెన్సీలో సీట్ల పంపకాలపై జనసేన తన వైఖరిని పరోక్షంగా స్పష్టం చేసినట్లుగా భావిస్తున్నారు.

# మైదుకూరు మున్సిపల్ ఎన్నికలు వాయిదా

- నామినేషన్ పత్రాలు చించివేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్న ఎస్ఈసీ
- త్వరలో కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని వెల్లడి
- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా మైదుకూరు మున్సిపల్ ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వాయిదా వేసింది. నామినేషన్ పత్రాలను చించివేయడంతో వాటి పరిశీలన కష్టంగా మారిందని, ఈ కారణంగా ఎన్నికల ప్రక్రియను



నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పునేతా స్పష్టం చేశారు. "నామినేషన్ పత్రాలను చించివేసినందున వాటి పరిశీలన కష్టం.. ఈ నేపథ్యంలోనే నిర్ణయం తీసుకున్నాము. జిల్లా కలెక్టర్ నివేదిక మేరకు మైదుకూరులో మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేస్తున్నాము. అక్కడ ఎన్నికల ప్రక్రియకు మళ్లీ నోటిఫికేషన్ ఇస్తాము" అని ఆయన వివరించారు.

ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌ను కూడా ఎస్ఈసీ విడుదల చేసింది. దీని ప్రకారం, అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా నిర్ణయించారు. నవంబర్ 3న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఈ ఎన్నికల ద్వారా రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్‌లు, 659 జడ్పీటీసీలు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 2,81,34,518 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# ప్రవాసాంధ్రులు స్వగ్రామాలకు వెళ్లి ఓట్లు వేయండి: పిల్ గురు రాజా

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని గ్లోబల్ ఎన్ఆర్ఐ తెదేపా అధ్యక్షుడు డా.పిల్ గురురాజా విజ్ఞప్తి చేశారు. ప్రసార మాధ్యమాల ద్వారా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి ప్రవాసాంధ్రులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏపీని మరింత ముందుకు తీసుకెళ్లడంలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలన్నారు. ప్రవాసాంధ్రులు వీలైనంత వరకు స్వగ్రామాలకు వచ్చి.. తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పనితీరును వివరించాలని సూచించారు.

## రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి..

# నష్టాన్ని వారి నుంచే వసూలు చేయండి

- తిరుపతి జిల్లాలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేసిన ఘటన
- వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదుకు పవన్ ఆదేశం
- నష్టాన్ని నిందితుల నుంచే వసూలు చేయాలని అధికారులకు సూచన
- ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం క్షమించరాని నేరమన్న డిప్యూటీ సీఎం
- 'పల్లె పండుగ 3.0' కింద వారం క్రితమే రోడ్డు నిర్మాణం

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా, పుల్లంపేట మండలం అనంతసముద్రంపాపక్కగారిపల్లె గ్రామాల మధ్య కొత్తగా నిర్మించిన రోడ్డును వైసీపీ నేత ధ్వంసం చేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని, ధ్వంసమైన రోడ్డుకు అయిన ఖర్చును వారి నుంచే వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా వారం రోజుల క్రితమే



రూ.4.75 కోట్ల వ్యయంతో ఈ గ్రావెల్ రోడ్డును నిర్మించారు. అయితే, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి, వెంకటసుబ్బారెడ్డి అనే మరో వ్యక్తి సహాయంతో ట్రాక్టర్‌తో రోడ్డును దున్ని సుమారు 100 మీటర్ల మేర ధ్వంసం చేశారు. గ్రామస్థులు అందించిన సమాచారంతో అధికారులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సోమవారం ఈ విషయంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసి, నిందితులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి ఆ మొత్తాన్ని వారి నుంచే రాబట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడిన వ్యక్తులతో పాటు వారి వెనుక ఉన్న శక్తులను కూడా చట్టం ముందు నిలబెట్టాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. నిందితులను ఈరోజు సాయంత్రంలోగా అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని అధికారులు ఉప డిప్యూటీ సీఎంకు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారి వివరాలను ప్రజలందరికీ తెలిసేలా బహిర్గతం చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు.

### ఓటమి భయంతోనే

## జగన్ అలజడులు : మంత్రి సత్యకుమార్

రాంనగర్ (అనంతపురం): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడం అసాధ్యమని తెలుసుకునే జగన్ గొడవలు సృష్టిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. అనంతపురం కార్పొరేషన్‌లోని 48వ డివిజన్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారభేరిని మంత్రి ప్రారంభించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, భాజపా నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ అభ్యర్థి సంగీతతో కలిసి లక్ష్మీనగర్ రామాలయంలో ప్రత్యేక



పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. మేయర్, స్థానిక కార్పొరేటర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. గతంలో చేసిన అరాచకాలను మరిచిపోయి, ఇప్పుడు కావాలనే కవ్వింపు చర్యలకు పాల్పడుతూ రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషన్‌కు, గవర్నర్‌కు ఫిర్యాదులు చేసి.. మళ్లీ వారినే విమర్శించడం తగదన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని అంతమొందించేందుకు పంజాబ్ నుంచి కిరాయి ముఠాలను తెప్పించారని, మళ్లీ ఫ్యాక్షన్ కక్షలకు ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. జగన్ ద్వంద వైఖరిని విడనాడి ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

# ఏపీ పురపోరు.. చివరి రోజు వెల్లువెత్తిన నామినేషన్లు

- ముగిసిన ఏపీ పురపాలక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ
- మొత్తంగా 25,819 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల సంఘం వెల్లడి
- చివరి రోజైన ఆదివారం ఒక్కరోజే 17 వేలకు పైగా నామినేషన్లు
- నేడు నామినేషన్ల పరిశీలన.. 21న ఉపసంహరణకు తుది గడువు
- అక్టోబర్ 28న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి




ఏపీలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల ఘట్టం ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియలో మొత్తం 25,819 నామినేషన్లు దాఖలైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం రాత్రి ప్రకటించింది. నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన నిన్న ఒక్కరోజే భారీగా 17,291 నామినేషన్లు దాఖలు కావడం గమనార్హం. చివరి రోజు అందిన నామినేషన్ల వివరాలను పరిశీలిస్తే, 13 నగరపాలక సంస్థల్లో మేయర్ పదవుల కోసం 244 మంది, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఛైర్‌పర్సన్ పదవుల కోసం 765 మంది నామినేషన్లు వేశారు. అలాగే కార్పొరేటర్ స్థానాలకు 5,532, కౌన్సిలర్ స్థానాలకు 10,750 నామినేషన్లు చివరి రోజున అభ్యర్థుల నుంచి అందాయి. మూడు రోజుల గడువులో దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్యను పరిశీలిస్తే.. రాష్ట్రవ్యాప్తంగా మేయర్ పదవుల కోసం 330 మంది, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులకు 1,038 మంది పోటీలో నిలిచేందుకు నామినేషన్లు సమర్పించారు. ఇక, కార్పొరేటర్ స్థానాలకు 8,198, కౌన్సిలర్ స్థానాలకు 16,253 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. దాఖలైన నామినేషన్ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని నేడు చేపట్టనున్నారు. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి అక్టోబర్ 21వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. అనంతరం అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.



## హైకోర్టులో వైకాపాకి మరో ఎదురుదెబ్బ

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైకాపాకి హైకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర బలగాల భద్రతతో స్థానిక ఎన్నికలు జరపాలన్న వైకాపా పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల భద్రత ఉంచేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని వైకాపా కోరింది. వైకాపా అభ్యర్థనను తోసిపుచ్చుతూ ఈ నెల 16న హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ తీర్పునిచ్చింది. దీనిపై వైకాపా.. డివిజన్ బెంచ్‌కు వెళ్లింది. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ పిటిషన్‌ను కొట్టివేసింది.

### ఒక్క ఓటు కూడా చీలకూడదు..

## విజయవాడలో వంగవీటి రాధాను గెలిపించుకుందాం

- విజయవాడ మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకు టీడీపీ పూర్తి మద్దతు
- సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించిన పార్టీ
- రాధాను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపు
- కులతత్వం రెచ్చగొట్టేవారికి బుద్ధి చెప్పాలని కోరిన టీడీపీ
- కూటమి గెలుపుతో విజయవాడను అభివృద్ధి చేస్తామని హామీ



విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల నేపథ్యంలో, కూటమి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ అభ్యర్థిత్వంపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారానికి తెలుగుదేశం పార్టీ చెక్ పెట్టింది. రాధాకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేస్తూ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. కొద్ది రోజులుగా రాధా అభ్యర్థిత్వంపై టీడీపీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లుగా సాగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అది పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది. ఈ మేరకు టీడీపీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందరూ చూస్తున్నారు. ఇప్పుడు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా కూటమి అభ్యర్థినే గెలిపించుకుందాం," అని పిలుపునిచ్చింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడిగా బరిలో నిలిపిన వంగవీటి రాధాకృష్ణను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరింది. కులాల పేరుతో రెచ్చగొట్టి ఓట్లు చీల్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని టీడీపీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. "కులం పేరుతో ఎవరు ఎన్ని విధాలుగా రెచ్చగొట్టినా కూటమి ఓటు చీలకుండా మన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను గెలిపించుకుందాం. కులతత్వం రెచ్చగొడుతున్న వారికి దీటుగా సమాధానం ఇద్దాం" అని పార్టీ శ్రేణులకు, ప్రజలకు స్పష్టం చేసింది. రాధా గెలుపు కోసం కూటమిలోని మూడు పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయని, ఆయన విజయంతో విజయవాడ కార్పొరేషన్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని టీడీపీ భరోసా ఇచ్చింది.

## కూటమి ఖాతాలోకి దాచేపల్లి నగర పంచాయతీ!

దాచేపల్లి: పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ కూటమికి ఏకగ్రీవం కానుంది. ఇక్కడ ఛైర్మన్ స్థానం కోసం మూడు నామినేషన్లు దాఖలవగా.. వాటిలో రెండు తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్ పత్రాల పరిశీలన సందర్భంగా వైకాపా అభ్యర్థి కొప్పుల రవికుమార్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థి నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. వైకాపా అభ్యర్థి సెక్యూరిటీ డిపాజిట్ రూ.3వేలు చెల్లించని కారణంగా ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. తెదేపా ఛైర్మన్




అభ్యర్థి తంగెళ్ల శ్రీనివాసరావు నామినేషన్ మాత్రమే ఆమోదం పొందింది. దీంతో దాచేపల్లి నగర పంచాయతీ కూటమి ఖాతాలో చేరనుంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## భవాని భక్తులతో వెళ్తున్న వాహనం బోల్తా.. ఇద్దరు మృతి

పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఘాట్ మార్గంలో భవాని భక్తులతో వెళుతున్న బొలెరో వ్యాన్ కొండను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో వ్యాన్‌లో 25 మంది ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను మాడుగుల ఆసుపత్రికి తరలించారు. అనకాపల్లి జిల్లా జుత్తాడకు చెందిన భవాని భక్తులు పాడేరు అమ్మవారిని దర్శించుకుని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.



### నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ..

## మున్సిపల్ ఎన్నికలపై విపక్షాలకు లోకేశ్ చురకలు

- ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌ను కలిసిన మిజోరం సీఎం లాల్‌దుహోమా
- పురపాలక ఎన్నికలకు 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయన్న లోకేశ్
- ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందని చెప్పడానికి నిదర్శనమని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లాల్‌దుహోమాను శాలువాతో సత్కరించి, ప్రత్యేక






జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు పలు కీలక



అంశాలపై చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఎన్నికలకు రికార్డు స్థాయిలో 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పార్టీ, ప్రతి వర్గం, నలుమూలల నుంచి అభ్యర్థులు ముందుకు రావడం ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందనడానికి నిదర్శనమని అన్నారు. ఒక్క ఓటు కూడా పడకముందే అక్రమాలు జరిగాయని ఆరోపించే వారు ఒక విషయం గుర్తుంచుకోవాలని లోకేశ్ హితవు పలికారు. "ఎన్నికల్లో గెలుపు క్షేత్రస్థాయిలో ఉంటుంది కానీ, పత్రికా సమావేశాల్లో కాదు. ప్రజలను ఎదుర్కోండి, ప్రజలే ఫలితాలను నిర్ణయిస్తారు" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగనున్న విషయం తెలిసిందే.

# తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్.. పొదుపు బాటలో ప్రభుత్వం!

- **ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్**
- **ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల వాడకంపై ఆంక్షలు విధింపు**
- **పరిశ్రమలకు విద్యుత్ కోతలు ఉండవని స్పష్టం చేసిన సర్కార్**
- **తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కార్యాచరణ**
- **హైదరాబాద్‌లో అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక డ్రైవ్**

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో విద్యుత్, నీటి వినియోగం గణనీయంగా పెరిగింది. మరోవైపు ఉత్పత్తి, లభ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పొదుపు చర్యలతో పాటు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పగటి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఎయిర్ కండిషనర్లను (ఏసీ) వినియోగించవద్దని, వాటిని కూడా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్దే నిర్వహించాలని స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఏసీల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికీ, వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా సరఫరా అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ కోతలు విధించడం లేదని, పారిశ్రామిక యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అన్ని థర్మల్ పవర్ స్టేషన్లలో



విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే తాగునీరు, విద్యుత్ కొరతను నివారించేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంజయ్ జాజు సూచించారు. ఈ అంశంపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం, కేబినెట్ సబ్‌కమిటీ భేటీ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

*** నీటి కష్టాలు.. అక్రమ మోటార్లపై ఉక్కుపాదం**

స్థానిక నీటి వనరుల నుంచి వ్యవసాయానికి అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడేస్తుండటంతో, విద్యుత్ లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఇంధన శాఖ అధికారులు సమావేశంలో వివరించారు. మంజీరా, సింగూరు రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత లేకపోవడంతో, అక్కడి నుంచి అందాల్సిన 110 మిలియన్ గ్యాలన్ల నీటిని మిషన్ భగీరథ (60 MGD), కృష్ణా నది వంటి ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు తప్ప నిర్మాణాలకు, ఇతర పనులకు కొత్త బోర్ల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్పష్టం చేశారు. నగరంలో మున్సిపల్ నల్లా కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడ్పుతున్న వారిపై 'హైడ్రా' సహకారంతో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణాలకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని (ఎస్‌టీపీ వాటర్) సరఫరా చేయనున్నట్లు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గుతున్నాయని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేస్తున్నామని మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు.

## హైదరాబాద్‌లో కొత్త బోర్లకు అనుమతులివ్వొద్దు: సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్: ఎల్‌నినోపై ఉమ్మడి జిల్లాల ప్రత్యేక అధికారులతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీరు, విద్యుత్ సమస్య రాకుండా మండల స్థాయి వరకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పరిశ్రమలకు పవర్‌కట్



ఉండబోదని, యాజమాన్యాలు ఆందోళన పడొద్దని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ పొదుపుగా వాడాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్మాణాల కోసం కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వొద్దని చెప్పారు. మరోవైపు నల్లాలకు మోటార్లు పెట్టకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు ప్రత్యేకాధికారి జయేశ్ రంజన్ తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణ పనులకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.

## సింథటిక్ డ్రగ్స్ తయారీ ముఠా గుట్టురట్టు

హైదరాబాద్: తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసులు సింథటిక్ డ్రగ్స్ తయారీ ముఠా గుట్టురట్టు చేశారు. అంతర్రాష్ట్ర సింథటిక్ డ్రగ్స్ తయారీ, సరఫరా నెట్‌వర్క్‌ను ఛేదించారు. మహారాష్ట్రలోని గోండియా జిల్లా మారేగవ్‌లో రహస్య ల్యాబ్‌లో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్ తయారీకి వినియోగించినట్లు అనుమానిస్తున్న పరికరాలు, రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ, మహారాష్ట్రలో విస్తరించిన డ్రగ్స్ తయారీ, సరఫరా నెట్‌వర్క్‌పై ఈగల్ ఫోర్స్ బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. ఆగస్టు 8న బీబీనగర్ పోలీసుల తనిఖీల్లో భారీగా డ్రగ్స్, రసాయనాలను పోలీసులు పట్టుకున్నారు. 27.2కిలోల మెఫెడ్రోన్,



56.98 కిలోల అసిటోన్ స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్న బీబీనగర్ పోలీసులు.. కొండమడుగు, మౌలాలి ప్రాంతాల్లోని ల్యాబ్‌లతో సంబంధాలపై దర్యాప్తు చేశారు. డ్రగ్స్ తయారీకి ఉపయోగించే ప్రొపియోనిల్ క్లోరైడ్ సరఫరాపై ఆరా తీశారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రకు చెందిన జేఎస్‌వీ గ్లోబల్స్ యజమాని జైరాజ్ కృష్ణ శెట్టిని అక్టోబర్ 17న ఈగల్ ఫోర్స్ అరెస్టు చేసింది. రసాయనాల సరఫరా, ల్యాబ్ నిర్వహణ, ప్రత్యేక పరికరాలు సమకూర్చడంలో ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలో ఆయన్ను విచారించగా తీగలాగితే డొంక కదిలినట్లు మొత్తం ముఠా గుట్టురట్టయింది. మెఫెడ్రోన్‌తోపాటు అల్ప్రాజోలమ్, ఎఫెడ్రిన్ తయారీ ఆరోపణలపైనా దర్యాప్తు చేసిన పోలీసులు.. 11 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో 13 మంది పరారీలో ఉండగా.. వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

## నకిలీ నంబర్‌ప్లేట్లు.. 100 మందిపై క్రిమినల్ కేసులు

హైదరాబాద్: నకిలీ నంబర్‌ప్లేట్లతో వాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. గత 8 నెలల వ్యవధిలో 100 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి.. వారి వాహనాలను సీజ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటన విడుదల చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అనధికారిక రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ప్రదర్శిస్తున్న వాహనదారులపై చర్యలకు ఉపక్రమించారు. ట్రాఫిక్ చలాన్‌ల నుంచి తప్పించుకోవడంతోపాటు, తమ వాహనాలను గుర్తించకుండా నకిలీ నంబరు ప్లేట్లను వినియోగిస్తున్నారనే ఫిర్యాదులు



పెరగడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. సీజ్ చేసిన వాహనాల్లో 88 ద్విచక్రవాహనాలు, 12 ఫోర్ వీలర్ వాహనాలు ఉన్నాయి.

## పండగల వేళ హైదరాబాద్ పోలీసు శాఖలో మార్పులు.. భారీగా ఎస్ఐల బదిలీ

- **హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 75 మంది ఎస్ఐల బదిలీ**
- **పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పాలనాపరమైన మార్పులు**
- **లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం**
- **బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని సీపీ సజ్జనార్ ఆదేశం**
- **ఒకేచోట ఎక్కువకాలం పనిచేస్తున్న వారిని బదిలీ చేసినట్లు వెల్లడి**

హైదరాబాద్ నగరంలో పండగల సీజన్ సమీపిస్తున్న వేళ పోలీసు శాఖలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 మంది సబ్ఇన్‌స్పెక్టర్లను (ఎస్ఐ) బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పటిష్ఠతలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్, కంట్రోల్ రూమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులను ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా మార్పు చేశారు. ముఖ్యంగా ఎక్కువ కాలంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను గుర్తించి వేర్వేరు స్టేషన్లు, విభాగాలకు కేటాయించినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ స్పష్టంగా ఆదేశించారు. ఈ విషయంలో




ఎలాంటి ఆలస్యం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాబోయే పండగలు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకునే ఈ మార్పులు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

## హనీట్రాప్.. పోలీసు అధికారినే బురిడీ కొట్టించి..

హైదరాబాద్: మహిళ పేరుతో పోలీసు అధికారినే బురిడీ కొట్టించాడో (Honey Trap Case) నిందితుడు. చాటింగ్ ద్వారా పరిచయం పెంచుకొని డబ్బులు డిమాండ్ చేశాడు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన ఈ హనీట్రాప్ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు పవన్‌ను మీడియా ఎదుట ప్రవేశపెట్టి.. కేసు వివరాలను చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే వెల్లడించారు. మహిళ పేరుతో నిందితుడు పోలీసు అధికారిని ట్రాప్ చేసినట్లు చెప్పారు. "నిందితుడు పవన్‌ను సైదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళగా పరిచయం చేసుకున్న నిందితుడు పోలీసు అధికారితో వాట్సప్‌లో చాటింగ్ చేసి మరింత దగ్గరయ్యాడు. ఆ తర్వాత డబ్బులు డిమాండ్ చేసినట్లు మాకు సమాచారం



అందింది. దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నాం. నిందితుడి జాబితాలో వందల మంది బాధితులు ఉన్నారు. వేలాది వాట్సప్ చాటింగ్‌లు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ హనీట్రాప్ బాధితులు ఉన్నారు. దుబాయ్ వంటి విదేశాల్లో ఉన్నవారు కూడా పవన్ చేతిలో మోసపోయినట్లు మాకు సమాచారం ఉంది" అని డీసీపీ వెల్లడించారు.

## 50 డిగ్రీలకు చేరనున్న ఎండలు? గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన

- **సూపర్ ఎల్‌నినోతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తుమ్మల వ్యాఖ్య**
- **వర్షాలు తగ్గితే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం**
- **గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు**
- **దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం**
- **భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద ఆనకట్టను మంత్రి పరిశీలన**



తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్టను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని చెప్పారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. వర్షాలు తగ్గి భూగర్భజలాలు పడిపోయే పరిస్థితి ఏర్పడితే వ్యవసాయంతో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. నీటి లభ్యత తగ్గితే విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని తుమ్మల సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు. గోదావరి నీటిని నిల్వ చేసే ప్రయత్నాల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే పనులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## సింగరేణి అధికారులకు దసరా కానుక

హైదరాబాద్: సింగరేణి అధికారులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. కోల్‌ఇండియా తరహాలో వేతనాల పెంపునకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ 17 వరకు.. సుమారు 1,800 మందికి ప్రయోజనం కలగనుంది. సెప్టెంబర్ 25 నుంచి ఆర్థిక ప్రయోజనాలు వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సింగరేణి అధికారులు చేసిన విజ్ఞప్తిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈమేరకు నెరవేర్చారు.

## కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత.. ప్రభుత్వానికి హెచ్చరిక

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. మేడిగడ్డను ఒక భూతంగా చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. తమ పార్టీ కేవలం విమర్శించడానికే పరిమితం కాలేదని, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తోందని తెలిపారు. టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.



## 'తాగి పాడుతున్నావ్ ఆపు!'.. దలేర్ మెహందీని అడ్డుకున్న మంత్రి

దేహ్రాదూన్: ప్రముఖ పంజాబీ గాయకుడు దలేర్ మెహందీకి చేదు అనుభవం ఎదురైంది. నవరాత్రి వేడుకల్లో భాగంగా పాట ఆలపిస్తుండగా.. మంత్రి ఆయన్ను అడ్డగించారు. మద్యంమత్తులో పాడుతున్నావంటూ పాడొద్దని సూచించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ జిల్లాలో జరుగుతున్న ఉత్సవాలకు దలేర్ మెహందీ హాజరయ్యారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన పాట ఆలపిస్తుండగా.. నరేంద్రనగర్ ఎమ్మెల్యే, ఉత్తరాఖండ్ మంత్రి సుబోధ్ ఉనియాల్ నేరుగా వేదికపైకి వెళ్లి దలేర్ మెహందీ పాటను ఆపేశారు. "నవరాత్రుల సందర్భంగా దుర్గామాత కోసం ఏర్పాటు చేసిన పవిత్ర కార్యక్రమం ఇది. ఇలాంటి చోట మీరు మద్యం తాగి పాడటం ఏమాత్రం సరికాదు" అంటూ గాయకుడిపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. వేదిక పవిత్రతను, మర్యాదను కాపాడాలని గాయకుడిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అయితే, "దయచేసి వేదికను వీడండి" అంటూ దలేర్ మెహందీ రెండు చేతులు జోడించి మంత్రికి విజ్ఞప్తి చేయడం కనిపించింది. "సరిగా మాట్లాడలేకపోతున్నావ్.. ఏం పాడతావ్" అంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. కాసేపటి తర్వాత మంత్రి స్టేజీని వీడారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతోంది. మంత్రి ఆరోపణలపై దలేర్ మెహందీ గానీ, ఆయన టీమ్ గానీ వివరణ ఇవ్వలేదు.

పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్ దిన పత్రిక
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..



# స్వర్ణ రథంపై భక్తులకు దర్శనమిస్తున్న మలయప్పస్వామి

స్వర్ణ రథంపై భక్తులకు దర్శనమిస్తున్న మలయప్పస్వామి

తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉభయదేవేరులతో కలిసి స్వామివారు స్వర్ణ రథంపై విహరిస్తూ.. భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామస్మరణలతో భక్తులు స్వామివారి రథాన్ని ముందుకు లాగారు. ఆ ఫొటోలు



















# సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాకు నిరాశ ఎదురైంది. వీరి జ్యుడీషియల్ కస్టడీని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ (SEM) మరో రెండు రోజులు పొడిగించారు. మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో నేడు కొత్తగా నియమితులైన ఎస్ఈఎం ఎదుట సీజేపీ నాయకులను పోలీసులు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని కోరారు. ఈ నేపథ్యంలో సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ ఎస్ఈఎం ఆదేశాలు జారీ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఇటీవల దేశవ్యాప్తంగా సీజేపీ ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అనుమతి



లేకుండా ఢిల్లీలోని జంతర్‌మంతర్‌కు చేరడంతో.. ఒక ప్రైవేటు ప్రాంగణంలోకి చొరబడ్డారన్న ఆరోపణలపై సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ నెల 14న కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో తిహాడ్ జైలుకు తరలించారు. తాజాగా కస్టడీ ముగియడంతో పోలీసులు ఎస్ఈఎం ఎదుట హాజరు పరిచారు. తాజా పరిణామంతో సీజేపీ నేతలిద్దరూ బుధవారం వరకు జ్యుడీషియల్ కస్టడీలోనే ఉండనున్నారు.

*** ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం: రత్నసింగ్**

సీజేపీ నేతలను తిరిగి జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ఆ పార్టీ ప్రతినిధి రత్నసింగ్ స్పందించారు. జ్యుడీషియల్ కస్టడీపై చట్టపరంగా అన్ని వాదనలు వినిపించినట్లు తెలిపారు. కానీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిరాధార ఆరోపణలతో తమ వాదనలకు కౌంటర్ చేయలేకపోయారని తెలిపారు. సౌరవ్ దాస్, రాంకాలు ఇప్పటికే ఐదు రోజులు జైలులో ఉన్నారని, ష్యూరిటీ వెరిఫికేషన్ అవసరమన్న కారణంతో వారిద్దరి స్వేచ్ఛను పరిమితం చేయడం సరికాదని ఆమె అన్నారు. నేడు వీరిద్దరినీ తిరిగి జ్యుడీషియల్ కస్టడీకి పంపడానికి ఎలాంటి కారణం లేదన్న ఆమె.. ఈ అంశంపై తాము ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు.

## విమానాన్ని ప్లంబర్ ల్యాండ్ చేయగలరా..?: స్మిత్ మచ్చర్ ఏమన్నారంటే..?

ప్రపంచవ్యాప్తంగా దిగ్భ్రాంతి సృష్టించిన ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో ప్లంబర్ యానివ్ హయూన్ పేరు మారుమోగింది. ఎయిర్‌క్రాష్ ఇన్వెస్టిగేషన్ టీవీ షో చూసి, విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంలో అతడు కీలక పాత్ర పోషించారంటూ వార్తలు వచ్చాయి. వాటిపై పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్పందించారు. యూఏఈలో చికిత్స పొందుతోన్న స్మిత్ మచ్చర్ అంతర్జాతీయ మీడియాతో నాటి విషయాలను గుర్తుచేసున్నారు. ''నిజం చెప్పాలంటే నాకు ఆ ప్లంబర్ స్టోరీ తెలియదు. ఆకస్మికంగా జరిగిన దాడి తర్వాత విమానం కూలిపోకుండా చూడటంపైనే నా శక్తినంతా కూడదీసుకున్నాను. నన్ను కాపాడుకోవడం గురించి ప్రయత్నించాను. ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ విమానం కెప్టెన్ నియంత్రణలో ఉందని చెప్పడం నాకు గుర్తుంది. ఒక



ప్లంబర్ విమానాన్ని ల్యాండ్ చేయగలరా..? లేదా..? అని నేను ఎలాంటి ఊహాగానాలు చేయాలనుకోవడం లేదు'' అని మచ్చర్ అన్నారు. దాడి తర్వాత పరిస్థితులు ఎలా మారాయో పూర్తిగా గుర్తులేవన్నారు. ఒకవైపు దాడి జరుగుతున్నా.. ఎన్నో ప్రయత్నాల తర్వాత సీట్‌బెల్ట్ తీసుకొని, కాక్‌పిట్ డోర్ తెరవగలిగానని చెప్పారు. విమానాలు నడపడంలో ఏమాత్రం అనుభవం లేని ప్లంబర్ యానివ్ హయూన్ .. అత్యవసర సమయంలో ఫ్లైదుబాయ్ విమానాన్ని నియంత్రించాడని, అందుకు టీవీ షో ఉపయోగపడిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ''వృత్తిరీత్యా నేనో ప్లంబర్‌ను. కానీ, ఎయిర్‌క్రాష్ ఇన్వెస్టిగేషన్ టీవీ షో చూశా. అది గుర్తుకొచ్చే.. కంట్రోల్ స్టిక్స్‌ను వెనక్కి లాగాను. ఆ వెంటనే ఆఫ్‌డ్యూటీలో ఉన్న పైలట్ విమానాన్ని తన నియంత్రణలోకి తీసుకున్నారు. ఆ తర్వాత సౌదీ అరేబియాలోని తబుక్‌లో దాన్ని సురక్షితంగా దించడంతో మేమంతా ఊపిరిపీల్చుకున్నాం'' అని నాడు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు వెల్లడించిన సంగతి తెలిసిందే.

## మిలిటెంట్ల దాడిలో ముగ్గురి మృతి.. మణిపూర్ సీఎం ఇంటి వద్ద మృతదేహాలతో నిరసన

ఇంఫాల్: మణిపూర్‌లో మరోసారి తీవ్ర హింసాత్మక ఘటనలు తలెత్తాయి. సోమవారం ఉదయం ముగ్గురిని మిలిటెంట్లు హత్య చేశారు. దీంతో స్థానికులు నిరసనకు దిగారు. రెండు మృతదేహాలను సీఎం నివాసం వద్దకు తీసుకొచ్చి ఆందోళన చేపట్టడంతో ఇంఫాల్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. తూర్పు ఇంఫాల్, కాంగ్‌పోక్పి జిల్లాల సరిహద్దుల్లో వంటచెరకు సేకరిస్తున్న వారిపై మిలిటెంట్లు కాల్పులు జరిపిన ఘటనలో ముగ్గురు గాయపడగా.. మరో ముగ్గురు అదృశ్యమైనట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7గంటల సమయంలో కొండ ప్రాంతంలో వంట చెరకు కోసం 16 మంది వెళ్లగా.. ఆ సమయంలోనే మిలిటెంట్ల దాడి జరిగిందని వివరించారు. ఇదిలా ఉండగా.. 2023 నుంచి మణిపూర్‌లో రగులుతోన్న హింసాకాండపై ఆగ్రహించిన స్థానికులు మృతదేహాలను ఇంఫాల్‌కు తీసుకొచ్చి సీఎం నివాసం ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. అయితే, ఈ నిరసన సమయంలో సీఎం ఇంట్లో ఉన్నారా ? లేదా అనేది తెలియలేదు. ఈ క్రమంలో నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. అనంతరం మృతదేహాలను పోలీసులు ఆసుపత్రికి తరలించారు.




**క్షతగాత్రులకు సీఎం పరామర్శ**

మరోవైపు, తన నివాసం వెలుపల నిరసనల నేపథ్యంలో సీఎం ఖేమ్‌చంద్‌సింగ్ ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

## దేవీ స్వరూపంలోని గుణార్థం – హృదయ భాషలో సౌందర్యం

### గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్

ఆదిశంకరాచార్యుల వారు, ఇంకా అనేకమంది ఆచార్యులు దేవీ స్వరూపాన్ని ఎంతో విపులంగా వర్ణించారు. దేవి ఎలా కనిపిస్తారు? ఆమె వస్త్రాలు ఎలా ఉంటాయి? ఆమె చేతుల్లో ఏయే ముద్రలు ఉంటాయనే విషయాలను సమగ్రంగా తెలిపారు. దేవి సూక్ష్మశక్తి అయినప్పుడు, ఆమె రూపాన్ని ఇంతగా ఎందుకు వర్ణించారు? ఈ వర్ణనల వెనక ఉన్న అసలైన గుణార్థం ఏమిటి? నిజానికి, సౌందర్యంలోని మాధుర్యాన్ని బుద్ధి భాషలో కాకుండా, హృదయ భాషలోనే అనుభవించగలం. సౌందర్యాన్ని విశ్లేషించలేం. ఉదా: ఒకరి కళ్లను ప్రశంసిస్తూ మనం 'కమలనయనాలు' అని అంటాం. అప్పుడు ఎవరైనా, 'కమలంలోని ఏ రేకుల్లా ఆ కళ్లు ఉన్నాయి?' అని అడిగితే అది హాస్యాస్పదంగా అనిపిస్తుంది. కళ్ల అందాన్ని హృదయంతో మాత్రమే అనుభవించగలం. అందులో అతిగా తర్కం చేయడానికి ప్రయత్నిస్తే.. ఆ సౌందర్యాన్ని ఆస్వాదించే మాధుర్యం కోల్పోతాం. సౌందర్యాన్ని సౌందర్యంగానే స్వీకరించాలి. దానిని బుద్ధితో విశ్లేషించడానికి ప్రయత్నిస్తే విఫలమవుతాం. ఎందుకంటే సౌందర్యం హృదయంలో అనుభూతి చెందాల్సిన విషయం; దానిని కేవలం బుద్ధితో తెలుసుకోలేం. అలాగే, దేవి సౌందర్యాన్ని, ఆమె అలంకరణలను వర్ణించడం భక్తికి సంబంధించిన ఒక కవితాత్మక వ్యక్తీకరణ. దేవి సూక్ష్మశక్తి. ఆమెను పూర్తిగా మాటల్లో బంధించడం సాధ్యం కాదు. అయినప్పటికీ, శాస్త్రకర్తలు ఆమె ఆభరణాలు, వస్త్రాలు, హస్తముద్రలను వర్ణించారు. ఎందుకంటే, ఆ వర్ణనలు సాధకుని హృదయంలో



సౌందర్యభావాన్ని, భక్తిరసాన్ని మేల్కొల్పుతాయి. శాస్త్రాల్లో దేవి చేతుల ముద్రలకు కూడా ప్రత్యేకత ఉంది. ఒక చేతితో ఆమె వరద ముద్రను ప్రదర్శిస్తూ కృపను, ఆశీర్వాదాలను ప్రసాదిస్తారు. మరో చేతితో అభయ ముద్రను ప్రదర్శిస్తూ భయాన్ని తొలగిస్తారు.

**ప్రేమ స్వభావం ఇదే..**

వస్త్రాలు, ఆభరణాలు కేవలం బాహ్య అలంకరణలు మాత్రమే కావు. అవి దేవి గుణాలకు, శక్తులకు ప్రతీకలు. ధనానికి అధిదేవత అయిన లక్ష్మీదేవి కమలంపై ఆసీనులై ఉండటం ధనం



చంచలమైనదనే విషయానికి ప్రతీక. జ్ఞానానికి అధిదేవత అయిన సరస్వతీదేవి రాతిపై ఆసీనులై ఉండటం జ్ఞానం స్థిరమైనదనే భావానికి ప్రతీక. ఇక్కడ మరో లోతైన విషయం ఉంది. ప్రేమ, సౌందర్యాల వ్యక్తీకరణలో పునరావృతికి ఎప్పుడూ ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. ఒక గాయకుడు ఒకే పాటలోని పల్లవిని మళ్లీ మళ్లీ పాడతాడు. ప్రేమికుడు తన ప్రియురాలికి పదేపదే 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని రాస్తాడు. బుద్ధి ఏమంటుంది? 'ఒక్కసారి చెప్పావు కదా, ఇక చాలు!' అని అంటుంది. కానీ, హృదయం మాత్రం అదే మాటను మళ్లీ మళ్లీ చెప్పాలని, వినాలని కోరుకుంటుంది. ఇదే ప్రేమ స్వభావం. దేవి స్తోత్రాలు, ఆమె రూపవర్ణనలు, ఆమె నామాలను పదేపదే జపించడం.. ఇవన్నీ ఆ ప్రేమరసానికి ప్రతిబింబాలే. ఈ దృక్పథంతో చూస్తే.. దేవీ అలంకరణలు, ఆమె స్వరూప వర్ణనలు కేవలం బుద్ధిపరమైన వివరణలు కాదు. అవి సాధకుడి అంతరంగంలో భక్తిరసాన్ని, దైవానుభూతిని మేల్కొలిపే సాధనాలు. దేవిని బంగారు కాంతులతో ప్రకాశిస్తూ, రత్నాలు పొదిగిన ఆభరణాలు ధరించి, దివ్యమైన వస్త్రాలతో అలంకరించిన రూపంలో మనం ధ్యానం చేసినప్పుడు.. మన మనస్సు కూడా ఆ దివ్యత్వంలో లీనమవుతుంది. ఇది ధ్యానానికి సంబంధించిన ఒక పద్ధతి. బాహ్య రూపవర్ణన ద్వారా మనలోని అంతరంగ చైతన్యం మేల్కొంటుంది. మీరు ఈ వర్ణనలను కేవలం బుద్ధితో విశ్లేషించడానికి ప్రయత్నిస్తే, పెద్దగా ఏమీ పొందలేరు. అది ఒక పువ్వు సువాసనను విశ్లేషించడానికి ప్రయత్నించడం వంటిది. సువాసనను ఆస్వాదించడంలోనే ఆనందం ఉంది. ప్రయోగశాల నివేదికలో కాదు. అదేవిధంగా, దేవి స్వరూపం హృదయంతో అనుభూతి చెందాల్సిన విషయం. అది బుద్ధితో పరిష్కరించాల్సిన గణితం కాదు. అందువల్ల, దేవి స్వరూప వర్ణనలోని అసలైన గుణార్థం ఏమిటంటే.. సౌందర్యాన్ని, భక్తిని బుద్ధి అనే కొలమానంతో కొలవకూడదు. వాటిని హృదయపూర్వకంగా స్వీకరించాలి. దేవి అలంకరణలు, ఆమె హస్తముద్రలు, ఆమె దివ్య సౌందర్యం మనకు ఒక విషయాన్ని గుర్తుచేస్తాయి.. మన జీవితంలో కూడా కరుణ, శక్తి, మాధుర్యం, ప్రేమ అనే గుణాలు అలంకారాలుగా ఉండాలి. ఇదే దేవి ఆరాధనలోని అసలైన సారాంశం.

## నన్నెందుకు టార్గెట్ చేశారో అర్థం కావట్లేదు: టైగర్ ష్రాఫ్

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన కలకలం రేపుతోంది. తనను ఎందుకు టార్గెట్ చేశారో అర్థం కావడం లేదని, గతంలో తనకు ఎలాంటి బెదిరింపులు రాలేదని, ఎవరితోనూ శత్రుత్వం లేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేతో టైగర్ ష్రాఫ్ చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఆయనతో సమావేశమైన సమయంలో వెల్లడించినట్లు జాతీయ మీడియా పేర్కొంది. సాధారణంగా వారాంతాల్లో ఫుట్‌బాల్ ఆడిన తర్వాత అభిమానులతో టైగర్ ష్రాఫ్ ఫొటోలు దిగుతుంటారు. ఆదివారం అలసటగా అనిపించడంతో అభిమానులతో ఫొటోలు దిగలేదట. ఈ నిర్ణయం తనను ప్రమాదం నుంచి తప్పించిందని శిందేతో చెప్పినట్లు సమాచారం. అలాగే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్, నటుడు సల్మాన్ ఖాన్‌కు సంబంధించిన వ్యవహారాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తనను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో తెలియడం లేదని టైగర్ పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు కాల్పుల అనంతరం ఆదివారం రాత్రి టైగర్ ష్రాఫ్‌ను పరామర్శించిన ఏక్‌నాథ్ శిందే.. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నటుడికి వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు, ఆయన నివాసం వద్ద పోలీసు భద్రతను పెంచే చర్యలు చేపట్టనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

*** నిందితులను పట్టుకున్న రాజస్థాన్ పోలీసులు**



టైగర్ ష్రాఫ్‌పై కాల్పులకు పాల్పడిన నిందితులను రాజస్థాన్ పోలీసులు పకడ్బందీగా అదుపులోకి తీసుకున్నారు. ఆ వివరాలను కోటా ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ''కాల్పులకు పాల్పడిన అనుమానితులు రైల్లో ప్రయాణిస్తున్నారని, వారు కోటాకు చేరుకోవచ్చని సమాచారం అందింది. దాంతో వెంటనే మా బృందం రంగంలోకి దిగింది. రైలును ఆపించి, భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. 15 నిమిషాల్లోపే మా బృందం వారిని అదుపులోకి తీసుకోగలిగింది. వారిని మేం ముంబయి పోలీసులకు అప్పగిస్తాం'' అని పేర్కొన్నారు.

**సల్మాన్ ఖాన్‌కు భద్రత పెంపు..**

టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటన నేపథ్యంలో బాలీవుడ్‌లో మరో అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద భద్రతను పెంచారు. సల్మాన్ ఖాన్‌కు గతంలోనూ బెదిరింపులు వచ్చాయి. ఆయన నివాసం వద్ద కాల్పుల ఘటనలూ చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

## బాలీవుడ్‌ను వదలని పీడకల.. సెలబ్రిటీలపై పేలుతున్న తూటా..!

నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. ఆయన ప్రాణాలతో బయటపడగా.. పక్కన ఉన్న ఇద్దరు మాత్రం గాయపడ్డారు. ఇలా బాలీవుడ్‌కు చెందిన నటులు, గాయకులు, దర్శక నిర్మాతలే లక్ష్యంగా పలుమార్లు దాడులు జరిగాయి. అప్పట్లో అండర్ వరల్డ్ మాఫియా సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకోగా.. ఇప్పుడు బిష్ణోయ్ గ్యాంగ్ వారిని వెంటాడుతోంది.

**గుల్షన్ కుమార్..**

సంగీత ప్రపంచంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన టి సిరీస్ వ్యవస్థాపకుడు గుల్షన్ కుమార్ 1997 ఆగస్టు నెలలో హత్యకు గురయ్యారు. ఆయన అంధేరీలోని జితేశ్వర్ మహాదేవ్ ఆలయ దర్శనానికి వెళ్లిన సమయంలో ముగ్గురు దుండగులు 16 రౌండ్ల కాల్పులు జరపడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అండర్ వరల్డ్ మాఫియా ఈ ఘాతుకానికి పాల్పడిందని, మాఫియా డిమాండ్ చేసిన డబ్బులు ఇవ్వడానికి గుల్షన్ కుమార్ నిరాకరించడమే ఈ హత్యకు ప్రధాన కారణమని దర్యాప్తులో తేలింది. ఈ కేసులో సంగీత దర్శకుడు నదీమ్ సైఫీపై కేసు నమోదైంది. తర్వాత నదీమ్ నిర్దోషిగా తేలాడు. అండర్ వరల్డ్ గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు అబ్దుల్ రౌఫ్ (దావూద్ మర్చంట్), మరికొందరు దోషులుగా తేలారు.



## సినిమా




పెళ్లి తర్వాత తెలంగాణ కోడలిగా తొలి బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకుంది రష్మిక మందన్న. ట్యాంక్‌బండ్ వేదికగా జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలో భర్త విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక మందన్న పాల్గొన్నది. ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడింది. తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగకు రష్మిక ఇచ్చిన విలువకు రాజకీయ వర్గాలతో పాటు సామాన్యులు సైతం ఫిదా అవుతోన్నారు. బతుకమ్మ వేడుకలో పాల్గొని తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని విజయ్, రష్మిక ఘనంగా చాటిచెప్పారని మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు. తెలంగాణ ఆడపడుచుగా నిరూపించుకోవడమే కాకుండా ఈ వేడుకకే అందాన్ని తీసుకొచ్చిందని రష్మికను మెచ్చుకుంటున్నారు. బతుకమ్మ పండుగకు రష్మికను తీసుకొచ్చి, మన సంప్రదాయంలో భాగస్వామిని చేయడం అభినందనీయం అంటూ విజయ్‌ని ప్రశంసిస్తున్నారు.



## రష్మిక.. పూజా.. రుక్మిణి.. ఇప్పుడు దేవిక

తెలుగు ఇండస్ట్రీలో కన్నడ బ్యూటీల హవా కొనసాగుతోంది. రష్మిక మందన్న, పూజా హెగ్డే, రుక్మిణి వసంత్‌తో పాటు పలువురు కన్నడ సుందరీమణులు టాలీవుడ్ టాప్ హీరోయిన్లుగా చెలామణి అవుతోన్నారు. తాజాగా వీరి బాటలోనే మరో శాండల్‌వుడ్ సుందరి దేవికా భట్ అడుగులు వేయబోతుంది.

ఎంబీఏ పూర్తిచేసిన దేవికా భట్ ఓ ఆర్కిటెక్చర్ కంపెనీలో చాలా రోజుల పాటు జాబ్ చేసింది. యాక్టింగ్‌పై ఇంట్రెస్ట్‌తో ఉద్యోగాన్ని వదిలేసిన ఈ కన్నడ భామ రామాచారి సీరియల్‌తో ఫస్ట్ టైమ్ కెమెరా ముందుకొచ్చింది. ఈసీరియల్‌లో రుక్మిణి అనే పాత్రలో అసమాన నటనతో ఆకట్టుకుంది. సీరియల్ ద్వారా వచ్చిన గుర్తింపుతో కన్నడ సినిమా బృందా విహారిలో ఛాన్స్ దక్కించుకుంది. గణేష్ హీరోగా నటించిన ఈ మూవీకి దండుపాళ్యం ఫేమ్ శ్రీనివా సరాజు దర్శకత్వం వహించాడు.

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తోన్న మూవీ... రియాలిటీలో దేవికా భట్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆలోచన అనే పాత్రలో కనిపించబోతుంది.



## విలన్‌గా రితేశ్



టాలీవుడ్ హీరో రామ్ పోతినేని డైరెక్టర్‌గా మారి ఓ సైకలాజికల్ థ్రిల్లర్ సినిమాను తెరకెక్కిస్తోన్నారు. ఇందులో ఆయనే హీరోగా కనిపించబోతున్నారు. అయితే ఈ సినిమాలో జెనీలియా భర్త విలన్‌గా రితేష్ దేశ్‌ముఖ్ కనిపించబోతున్నాడు. సోమవారం ఈ బాలీవుడ్ హీరో రామ్ మూవీ సెట్స్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా మేకర్స్ ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. నేటి నుంచి కొత్త షెడ్యూల్ మొదలైనట్లు ప్రకటించారు. పాతకాలం నాటి బిల్డింగ్‌లో షూటింగ్ జరుగుతోన్నట్లు ఈ వీడియోలో చూపించారు.

రితేష్, జెనీలియా ఫ్యామిలీతో రామ్‌కు చక్కటి స్నేహం ఉంది. రామ్, జెనీలియా కలిసి రెడీ సినిమాలో నటించారు. ఆ స్నేహబంధంతోనే రామ్ డైరెక్షనల్ డెబ్యూ మూవీలో నటించడానికి రితేష్ ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ సినిమాను రామ్ సోదరుడు కృష్ణచైతన్య నిర్మిస్తున్నారు. దాదాపు వంద కోట్ల బడ్జెట్‌తో ఈ మూవీ రూపొందుతోన్నట్లు సమాచారం.

## గాయని సుశీల బయోపిక్

తెలుగు దిగ్గజ నేపథ్య గాయని సుశీల జీవితం సినిమాగా వెండితెరపైకి రాబోతుంది. తెలుగు, తమిళంతో పాటు పదకొండు భాషల్లో కలిపి యాభై వేలకుపైగా పాటలు పాడారు పి సుశీల. ఒక్క తెలుగులోనే 12వేల సాంగ్స్‌ను పాడి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నారు. తెలుగు కుటుంబంలో పుట్టి తమిళం, మలయాళం, కన్నడంతో పాటు అనేక భాషల్లో టాప్ సింగర్‌గా పేరుతెచ్చుకున్నారు. ఐదు సార్లు నేషనల్ అవార్డులతో పాటు పద్మభూషణ్‌తో పాటు అనేక పురస్కారాలు దక్కించుకున్నారు. ఈ సినిమాలో టైటిల్ పాత్రలో కన్నడ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించబోతుంది.